క్లుప్తంగా

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్ రిటైర్డ్ జడ్జి చంద్రయ్యను బుధవారం కల్వకుర్తిలో నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మిల్లర్ అసోసియేషన్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మానవహక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోవింద్ శ్రీనివాస్, కోశాధికారి కల్మిచర్ల రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బాలకృష్ణ, సాయిరాజు తదితరులు ఉన్నారు.

ఈటలకు వినతులు

అచ్చంపేట రూరల్: తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారయ్యేలా చూడాలని, గెస్ట్ లెక్చరర్లు, నిరుద్యోగులు, పలు సంఘాల నాయకులు బుధవారం అచ్చంపేటకు వచ్చిన బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అవకాశం వస్తే అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావిస్తానని ఈటల వారికి హామీ ఇచ్చారు.

మహిళల రక్షణే ధ్యేయం

అచ్చంపేట రూరల్: మహిళల రక్షణే షీ టీం ధ్యేయమని అచ్చంపేట షీం ఇన్‌చార్జ్ పద్మ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో షీ టీం బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 100కు లేదా సెల్: 7901099455 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుల్ వెంకట్‌నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

కల్వకుర్తిరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో సమ్మె సమయంలో అండగా నిలిచిన ప్రజాప్రతినిధులకు కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మనోహర చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ గోవర్ధన్, చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్‌లను శాలువాలతో సన్మానించారు. అనంతరం మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో మండలంలోని 24 గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



వెల్దండ: మండలంలోని పోషమ్మతండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయం కోసం బుధవారం సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్ రూ.లక్ష విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు సహకరించాలని కోరారురు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూపతిరెడ్డి, వావిళ్ల వెంకటమ్మ, రామకృష్ణ, మాజీ ఎంపీపీ జయప్రకాష్, నాయకులు అలీ, లక్ష్మణ్, రవి, మంగ్య, రమేష్, తుకారాం, విజయ్, కుమార్ తదితరులు ఉన్నారు.

రూ.25వేల ఆర్థికసాయం



వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి గ్రామాల్లో హరిశ్చంద్ర వీధి నాటకానికి నిర్వహణ కోసం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో బుధవారం ఫౌండేషన్ సభ్యులు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్‌రెడ్డి, రమేష్‌నాయక్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని ఖానాపూర్‌కు చెందిన వెంకటస్వామి గుండెపోటుతో మృతి చెందడంతో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖరీం, పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం చిట్టిగళ్ల చిట్టెయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

కమలం జెండా ఎగరేస్తాం

కల్వకుర్తిరూరల్: రాబోయే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కమలం జెండా ఎగరేస్తామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు ఇంటికెళ్లి ఆయనను కలిశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, నర్సింహ, బాలగౌడ్, చందు, ముదిరాజు, శ్రీశైలం ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ జిల్లా కార్యదర్శి వెంకటరమణ, రాఘవేదంర్, జిల్లా కార్యదర్శి లక్ష్మీనర్సింహరావు, నరేష్ ఉన్నారు.

అధికారులపై ఆగ్రహం



అధికారుల నిర్లక్షాన్ని సభ దృష్టికి తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు నిలదీశారు. బుధవారం ఎంపీపీ మనోహర అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎజెండాలోని అంశాలను చదివి వినిపిస్తుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడ్డుకున్నారు. గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పేరుకుపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, ఉపాధిహామీ సమస్యలు పరిష్కరించడం అలసత్వం వహిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధిహామీ ఏపీఓ చంద్రసిదార్థ్ పనితీరుపై ఎంపీటీసీలు శంకర్‌నాయక్, నర్సిరెడ్డి, సర్పంచ్‌లు జంగయ్య, నరేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. జీడిపల్లి, వెంకటాపూర్ గ్రామాల మధ్య చెట్లు ఏపుగా పెరిగాయని ఆయా గ్రామాల ప్రజలు వివరించారు. గుండూరు ఎంపీటీసీ నర్సిరెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ ఆహ్వానంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పేరు చేర్చకపోవడం సరికాదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీవ గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, ఆంజనేయులు, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్ జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీఎం సభకు ఏర్పాట్లు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

కొల్లాపూర్: పట్టణంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. కలెక్టర్ ఉదయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు పర్యవేక్షణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలు బుధవారం పనులను పరిశీలించారు. సభావేదిక ప్రాంగణానికి లాంఛనంగా పూజలు నిర్వహించారు. సభావేదిక సమీపంలో, పెంట్లవెల్లి రోడ్డు పక్కన, నాగర్‌కర్నూల్‌కు వెళ్లే దారిలో జరుగుతున్న పార్కింగ్ పనులను వారు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. శుక్రవారం సాయంకాలం నాటికి ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. పాలమూరు పంప్‌హౌజ్ వద్ద చేస్తున్న ఏర్పాట్ల గూర్చి నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా వన మహోత్సవం



అమ్రాబాద్: మండల కేంద్రంలో స్థానికులు బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు బైరోని గుండం శివాలయంలో పూజలు చేశారు. అక్కడే భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ సంబుశోభ ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



ఉప్పునుంతల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పీవీ మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కొత్త యశోద ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల బూత్ స్థాయి ఎలక్షన్ సన్నాహక సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, పీవీమోహన్ హాజరయ్యారు. ఈనెల 17న నిర్వహించే విజయభేరి గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మండలంలోని కమాలపూర్ తండా నుంచి 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు. మండలంలోని మర్రిపల్లికి చెందిన కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశంలో పీసీసీ నాయకులు నీరంజన్, యెన్నం జంగిరెడ్డి, నర్సింహ్మారావు, రఘుపతిరెడ్డి, రాజేందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు జటప్రోల్ గ్రామస్తులు బుధవారం కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ విజయం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుధారాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, గఫూర్, రాంచందర్, రామకృష్ణగౌడ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

తెలకపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని ఎక్సైజ్ క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మండలంలోని కమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు మంత్రి, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జక్కా రఘునందన్‌రెడ్డి, హనుమంతురావు, నరేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

కొల్లాపూర్ రూరల్: ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తండా, చెంచుగూడెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చెంచుగూడెంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 21 వరకు తమిళనాడులోని నమ్మక్కల్ జిల్లాలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోడు భూములు శిస్తూ చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలివ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్ గ్రామ సమీపంలో డీసీఎం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం మండల కేంద్రం నుంచి సైకిల్‌పై వెళ్తున్న నాగులయ్యను మాధవస్వామినగర్ సమీపంలో ప్రమాదవశాత్తు డీసీఎం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో నాగులయ్యకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాయుధ పోరాటం కమ్యూనిస్టుల సొంతం



బిజినేపల్లి: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల సొంతమని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని నిజాం, రజాకారులు, దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి 4500 మంది బలిదానం చేసిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. బిజినేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ 75వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణాజీ, శివశంకర్, శ్రీనివాసులు, రవి, రాములు, సాయిలు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

నాగర్‌కర్నూల్: ఆడపడుచులకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిగార్డెన్స్‌లో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి మొత్తం 96 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ చేసే వరకు పోరాటం



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. దీక్షలకు యాదవ సంఘం నాయకులు అప్పల మాసయ్యయాదవ్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో శీలం అగ్రస్వామి, పుట్టపాగ రాము, కొండూరు రాములు, కురుమయ్య, వెంకటస్వామి, బచ్చలకూర లక్ష్మణ్ తదితరులున్నారు.

బీఎస్పీ నాయకుల ఆందోళన



తెలకపల్లి: మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ స్టిక్కర్లు అతికించడంపై గ్రామంలో బీఎస్పీ నాయకుడు శివశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించిన దుండగులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌తోపాటు భీంపాగ మల్లేష్, గుగ్గిళ్ళ రాజేష్, శివ, రామస్వామి పాల్గొన్నారు.

కోఆర్డినేటర్ల నియామకం

కందనూలు: ఈనెల 17వ తేదీన నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభకు నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్లను టీపీసీసీ నియమించింది. నాగర్‌కర్నూల్ కోఆర్డినేటర్‌గా ఆశి రెడ్డి, అచ్చంపేట జంగారెడ్డి, కొల్లాపూర్ చరణ్ కౌశిక్ యాదవ్, కల్వకుర్తి జె నరేష్ కుమార్‌లను కోఆర్డినేటర్లుగా నియమించారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

తెలకపల్లి: మండలంలోని జంగమోనిపల్లిలో బుధవారం ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రంథాలయ సంస్థల జిల్లా చైర్మన్ హనుమంతురావు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమృత, రాంచంద్రయ్య, బలరాం, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ లింగమయ్య, బాలస్వామి, తిరుపతయ్య, మల్లేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభ కోసం సన్నాహక సమావేశం



కొల్లాపూర్: టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విజయభేరి సభ కోసం బుధవారం కొల్లాపూర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్లో చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ నేతలు పీవీ మోహన్, నిరంజన్‌లు హాజరై ప్రసగించారు. ఈనెల 17న నిర్వహించే విజయభేరీ సభకు సోనియాగాంధీ హాజరవుతారని, సభను విజయవంతం చేసేందుకు కొల్లాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు రంగినేని జగదీశ్వరుడు, కాటమోని తిరుపతమ్మ, కృష్ణయ్యగౌడ్, రాముయాదవ్, శ్రీలత రెడ్డి, గాదెల సుధారాణి, ఖాదర్‌పాష ఉన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు



పాఠశాలలో ఏర్పాటుచేసిన రాకెట్ ప్రయోగంపై ప్రదర్శన



విద్యుత్ జనరేషన్ ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 171 పాఠశాలల విద్యార్థులు 128 విజ్ఞాన ప్రదర్శనలు ప్రదర్శించారు. గణిత, విజ్ఞాన శాస్త్రం, సంస్కృతి సాంప్రదాయాలపై చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శిశుమందిరాల అకాడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణమాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న అసాధారణమైన ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించేందుకు పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. చంద్రయాన్-3, బోనాలు, బతుకమ్మ, వినాయకుని ప్రతిమల తయారీ, ఇతర సాంప్రదాయ పండుగలపై వాటిని ఆకృతుల రూపంలో ప్రదర్శనలను ఆసక్తిగా గమనించారు.

జాతీయ ఉపాధి హామీ పథకం ఒక వరం



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

అమ్రాబాద్: జాతీయ ఉపాధిహామీ పథకం పేదలకు వరం లాంటిదని అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. పదర మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బీక్యానియక్ అధ్యక్షతన 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022 జనవరి నుంచి 2023 మార్చినెల వరకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని పది గ్రామ పంచాయతీలల్లో నిర్వహించిన 701 పనులు, ఖర్చు రూ.2.76 కోట్లకు సంబంధించి ఐదుమంది డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీ తోపాటు వీఎస్ఏ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా గ్రామాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా డీఆర్‌పీల ఆధ్వర్యంలో ప్రజావేదికలో తనిఖీల వివరాలు వెల్లడించారు. జెడ్పీటీసీ రాంబాబునాయక్, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎస్ఆర్‌పీ అనీల్‌కుమార్, అంబుడ్స్‌మెన్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదుతో మేలు



కల్వకుర్తిలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్యులు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగుల వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా వారికి మేలు కలుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. గురువారం నుంచి అందించే ప్రతిసేవలు ఇక ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం తెలిపారు అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మధు, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మన్ననూర్: గ్రామీణ పేద కుటుంబాల వారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పథకం తీసుకొచ్చిందని వైద్యాధికారులు జాన్సన్, సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలందరికి విద్య, వైద్యం మాత్రమే అందించే ఓ బృహత్తర పథకానికి రూపకల్పన చేసిన ఈ పథకాన్ని రాష్ట్రపతి దౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. వైద్యం కోసం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. పల్లె దవాఖానలను అప్‌గ్రేడ్ చేస్తూ సేవలను విస్తృతం చేశారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మార్తమ్మ, వైద్య సిబ్బంది సులోచన, ప్రసన్న, కవిత, జగన్, లక్ష్మణ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఫిర్యాదు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ పంచాయతీ పరిధిలోని జాలుబండ కాలనీకి వెళ్లేందుకు కేఎల్ఐ కాల్వను అనుసరించి ఉన్న బాటను ఆక్రమించుకున్నారంటూ తహసీల్దార్ ప్రమీలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. బాటను జేసీబీతో తవ్వడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని జాలుబండ తండాకు చెందిన కాలనీవాసులు మహేష్, రామకృష్ణ, రాజు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

కందనూలు/ తాడూరు: మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన రైతు అల్లోజికి న్యాయం చేయాలని గ్రామ సమీపంలోని కంపెనీ వద్ద బుధవారం బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి నిరసన తెలిపారు. రైతుకు సంబంధించిన పొలాన్ని కొందరు లాక్కున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దిలీపాచారిని అదుపులోకి తీసుకొని తాడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పలువురు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాముకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని వివరించారు. నెల రోజులుగా దశలవారి ఆందోళనలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న, విద్యారాణి, యాదమ్మ, రత్న తదితరులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి



తెలకపల్లి: అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను శిక్షించాలని కోరుతూ దళిత బహుజన సంఘాల నాయకులు బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అండేడ్కర్ జాతర కమిటీ జిల్లా నాయకులు రాంచందర్, ప్రకాశ్ మాట్లాడుతూ మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహం కళ్లజోడుకు కాంగ్రెస్ నాయకుడు రాజేష్‌రెడ్డి స్టిక్కర్‌ను అంటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీటీసీ ఊశన్న, వెంకటయ్య, నర్సింహ, మైనార్టీ సంఘం నాయకులు, ఇతర అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల సమ్మె

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ల నిరవధిక సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, పలు సంఘాల నాయకులు వారికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. కల్వకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను వినతి పత్రం అందజేశారు.

-సాక్షి, నెట్‌వర్క్

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన భాస్కర్, శరత్‌కుమార్‌లపై అదే గ్రామానికి చెందిన శ్యాంపూరి అల్లాజీ, జంగయ్యలు మంగళవారం రాత్రి దాడి చేశారు. బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలోని పాలకేంద్రంలో భాస్కర్, అల్లాజీలు పనిచేస్తున్నారు. అల్లాజీపై పాలకేంద్ర యజమానికి భాస్కర్ ఫిర్యాదు చేయగా అతడిని తొలగించారు. దీంతో అల్లాజీ, అతని తమ్ముడు జంగయ్యలు కలసి మంగళవారం గ్రామంలో భాస్కర్, అతని బావమరది శరత్‌కుమార్‌లపై దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బైక్ ఢీ- వ్యక్తికి గాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఉర్కొండ మండలం ఇప్పపహాడ్‌కు చెందిన పెంటయ్యను మాడ్గుల మండలం అవురుపల్లికి చెందిన రమేష్ బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో పెంటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత తమ్ముడు పాండు ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, నాయకులు కురుమయ్య, ఎల్లయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, బాలయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను నియమించండి

లింగాల: కొన్ని రోజుల నుంచి మండలంలో తహసీల్దార్‌ను నియమించకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజుల నుంచి కార్యాలయంలో తహసీల్దార్ లేక పోవడంతో సమస్యగా మరింజ జఠిలం అయ్యింది. ఇక్కడకు బదిలీపై వచ్చిన తహసీల్దార్ జమీల్ వారం రోజులకే బదిలీ కావడంతో నేటి వరకు కొత్త వారిని నియమించపోవడంతో రెవెన్యూకు సంబంధిత పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా వచ్చిన డీటీ అనారోగ్య పరిస్థితుల కారణంగా సెలవులో ఉండడంతో ప్రస్తుతం కార్యాలయం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. కలెక్టర్ స్పందించి తహసీల్దార్ పోస్టును భర్తీ చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయ పనిముట్లపై శిక్షణ

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో కేవీకే పాలెం ఆధ్వర్యంలో ఒత్తిడి తగ్గించే పనిముట్లపై బుధవారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సైంటిస్ట్ జోత్స్న మాట్లాడుతూ వ్యవసాయదారులు వరినాటు నుంచి పంటకోత వరకు ఉపయోగించే పనిముట్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఇందుమతి, రావేఫ్ విద్యార్థినులు ప్రియాంక, పూజిత, శృతి చందన పాల్గొన్నారు.